క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేమూరు: భట్టిప్రోలు మండలంలోని కేవీఎస్‌కే విద్యా సంస్థలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ విక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి కళ్లజోళ్ల పంపిణీతో పాటు ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



నిజాంపట్నం: మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ కొమరవోలు నుంచి కళ్లిఫలం గ్రామానికి వెళ్లేందుకు రేపల్లె మెయిన్ డ్రెయిన్‌పై రూ.8.20కోట్లతో వంతెన, రహదారి నిర్మాణానికి టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణంతో చెక్కావారిపాలెం నుంచి కొమరవోలు గ్రామానికి రాకపోకలు సాగించేవారికి, వరి, ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, కృష్ణ పశ్చిమ డెల్టా సాగునీటి ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధరరావు, నాయకులు కొలసాని రాము, రాగం కల్యాణ్, నల్లపాటి ఎల్లయ్య, ప్రజ్ఞం, చెక్కవారిపాలెం, కొమరవోలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'టెస్ట్ యువర్ చైల్డ్' ప్రదర్శన



రేపల్లె రూరల్: పట్టణంలోని భాష్యం స్కూలులో టెస్ట్ యువర్ చైల్డ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో నేర్చుకున్న పాఠ్యాంశాలను చిన్నారులు తల్లిదండ్రులకు ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా జోనల్ అధికారి హృదయరాజ్ మాట్లాడుతూ చిన్నారులలో సృజనాత్మకత పెరిగేలా, కొత్త ఆలోచనలు రేకెత్తించేలా టెస్ట్ యువర్ చైల్డ్ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఛాంప్స్ హెచ్‌ఎం ఇందిర, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పట్టణంలోని పేటేరు రోడ్డు, ప్రభుత్వ వైద్యశాల, రింగు రోడ్డు, తాలూకా సెంటరు, రైల్వే స్టేషన్ రోడ్డు, నేతాజీ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ శివనాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

27న పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎన్నిక

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక ఈనెల 27న నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు అందాయని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు శనివారం తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలో మొత్తం 11మంది ఎంపీటీసీలు ఉండగా చందోలు-1 ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కే బాజీ ఎంపీపీగా తొలుత ఎన్నికయ్యారు. ఆయన ఇటీవల రాజీనామా చేయడంతో పిట్టువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు దెందుకూరి సీతారామరాజు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 23న నోటిఫికేషన్ జారీ చేసి, 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చెరుకుపల్లి: మండలంలోని గుళ్లపల్లి జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన నాన్నగారు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నపల్లి సత్యనారాయణ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంఈఓ పులి లాజర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాన్న గారు స్వచ్ఛంద సంస్థ పేదలకు, పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె మార్కెటింగ్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు వంగరు భాను, పొన్నపల్లి వినీల, ఉల్లంగుంట రామారావు, కొక్కిలిగడ్డ వీర్రాజు, బొర్రా సాయిబాబు, ఉల్లంగుంట సాంబశివరావు, జొన్నాదుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి కుంటలతో భూగర్భ జలాల పరిరక్షణ

ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి

భట్టిప్రోలు: వర్షా కాలంలో నీటిని ఒడిసిపట్టి పంటలకు వినియోగించుకోవడం ద్వారా అధిక దిగుబడి, భూగర్భ జలాల రక్షణకు దోహదపడుతుందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవదాయ భూముల్లో నీటి కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు ఏటా ఆదాయం వచ్చేలా నీటి కుంటల నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. కుంట చుట్టూ పండ్లు, కూరగాయల పెంపకంతో పాటు బాతులు, చేపలు పెంపకం కూడా చేపట్టవచ్చని తెలిపారు. రాష్ట్రంలోని 300 గ్రామాల్లో భూగర్భ జలాలు ప్రమాదకరస్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో బాపట్ల జిల్లాలో 18 గ్రామాలు ఉండటం దురదృష్టకరమని తెలిపారు. మండలంలో 165 నీటి కుంటల నిర్మాణాలను లక్ష్యంగా ఇచ్చారని, జూన్ లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకట రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు టి. ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఏపీవో శివపార్వతి, రైతులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ

అమర్తలూరు(వేమూరు): ఇంకుడు గుంతలు ద్వారా నీటిని సంరక్షించు కోవాలని ఎంపీడీవో బి. మారుతీ శేషమాంబ అన్నారు. అమర్తలూరులో శనివారం ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా ఇంకుడు గంతలు తీయనున్నట్లు చెప్పారు. రైతులంతా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, ఏపీడీవో సువార్త, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.



అమర్తలూరులో నీటి గుంతను ప్రారంభిస్తున్న ఎంపీడీవో మారుతీ శేషమాంబ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

హిమనీ నదాలను కాపాడుకోవాలి

బాపట్ల: హిమనీ నదాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డ్వామా పీడీ ఎ.వి. విజయలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో స్థానిక ఆహార శాస్త్ర, సాంకేతిక కళాశాలలో సభ నిర్వహించారు. పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భూతాపం వల్ల హిమనీ నదాలు సత్వరం కరిగిపోవడం వల్ల నీటి కొరత వస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాల మనుగడ కోసం భూతాపాన్ని కూడా అందరం కలిసికట్టుగా కట్టడి చేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా 200కోట్ల మంది తీవ్ర మంచి నీటి ఎద్దడి ఎదుర్కొని ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ 360కోట్ల మంది సురక్షితమైన మంచినీటి సౌకర్యం లేక అల్లాడిపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏడీ ఎం.సర్దార్ బేగ్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి.సి.సాయిబాబు, న్యాయవాది తోట రామాంజనేయులు, కరణం రవీంద్ర, మానం అప్పారావు పాల్గొన్నారు.



పంట కుంట నిర్మాణంలో పాల్గొన్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయభాస్కరి

వేసవిలో అప్రమత్తత అవసరం

భట్టిప్రోలు: వేసవిలో అధిక ఎండల దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీపీ డి.వి.లలిత కుమారి శనివారం సంబంధిత మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో మంచినీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్య సిబ్బంది సహాయంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందించాలని చెప్పారు. ఆశా కార్యకర్తల సహాయంతో వేసవి దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గ్రామాలలోని వైద్య సిబ్బంది ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. వ్యాయామం ఉదయం, సాయంత్రమే చేయాలని తెలిపారు. తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతో పాటుగా మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ప్యాకింగ్ చేసిన పండ్లను, కూరగాయలను కాకుండా తాజాగా తీసుకుంటే మేలు అని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ సేతు రామచంద్రరావు, ఏపీవో శివపార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి

రేపు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

రేపల్లె రూరల్: పట్టణంలో సమస్యల పరిష్కార సాధనకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పి.హెచ్. మణిలాల్ పిలుపునిచ్చారు. ధర్నా నేపథ్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిట్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ రోజువారి పనులు చేసుకునే పలువురు పేదలు పట్టణానికి గత 30 ఏళ్లలో పెద్దఎత్తున వలస రావటంతో ఇళ్ల స్థలాల సమస్య పెరిగిందని చెప్పారు. అవసరమైన వారికి రెండు సెంట్లు చొప్పున నివేసన స్థలాలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.కిషోర్, కె.రమేష్, ఆశీర్వాదం, అగస్టీన్, నవీన్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించేదిలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వైన్‌షాపులను ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ దివాకర్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. మద్యం దుకాణాలు విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనను అతిక్రమించి రేపల్లె పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వైన్‌షాపును ఏర్పాటు చేయటం తగదని తెలిపారు. పేటేరులో ఇళ్ల మధ్య దుకాణాన్ని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల ముఖద్వారానికి 70 మీటర్ల సమీపంలో ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాన్ని ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే పేటేరులో మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర వ్యతిరేకత చూపారని తెలిపారు. అధికార యంత్రాంగం చెబుతున్న దానికి, చేస్తున్న దానికి పొంతనలేదని విమర్శించారు. విద్యాసంస్థల దగ్గర మద్యం షాపును ఏర్పాటు చేస్తే ప్రజా సంఘాల మద్దతు కూడగట్టి అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, విద్యార్థి, సామాజిక సంఘాల నాయకులు కె.రమేష్, వై.కిశోర్, కె.ఆశీర్వాదం, డి.అగస్టీన్, వై.నవీన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు

వేమూరు: క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ కె. పున్నారావు తెలిపారు. మండలంలోని పెరవలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, కళ్లె పడటం, చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతీ నొప్పి లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. మందులతో క్షయ వ్యాధిని నివారణ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎం.ముత్యాలరావు, కాలేబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

29న స్వరలయ వేదిక రజతోత్సవ వేడుకలు

వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయవేదిక ఆధ్వర్యంలో రజతోత్సవ ఉగాది వేడుకలను ఈనెల 29న నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు వెల్లడించారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది పురస్కారాలను వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. స్వరలయ వేదిక నిర్వహణలో గత 24 ఏళ్లుగా ఉగాది వేడుకలను జరుపుతూ, లబ్ధప్రతిష్టులకు పురస్కారాలను బహూకరిస్తున్నట్టు గుర్తుచేశారు. ఈ ఏడాది రజతోత్సవ ఉగాది వేడుకల్లో సేవ, కళ, సంగీత, పరిశోధన, నృత్య రంగాలకు చెందిన ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, షేక్ తిరుమలాబీ, కొండపి వసుంధర, డాక్టర్ దాసరి విజయలక్ష్మి, వసంత దుర్గకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథి, రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు అవార్డుగ్రహీతలను సత్కరిస్తారని తెలిపారు. పిరమిడ్ యోగ సాధకుడు డాక్టర్ జాస్తి వెంకటసుబ్బారావు ధ్యానంపై ఉపన్యసిస్తారు. తన సంకలనంలో వెలువరించిన 'మన పండుగలు', 'విశ్వవిజేతలు' పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత పోస్టల్ అధికారి తిరుమలరావు, నటుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయి లక్కరాజు

25న క్రెడిట్ క్యాంప్

కర్లపాలెం: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 25న కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ, కాపు కులాలకు చెందిన వారంతా హాజరుకావాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్, రేషన్‌కార్డులతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

పిట్టలవానిపాలెంలో...

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారందరూ ఈనెల 25న పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే క్రెడిట్ క్యాంపుకు హాజరుకావాలని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు శనివారం ప్రకటనలో కోరారు. బీసీ, ఈబీసీ, కాపు కులస్తులకు జరిగే క్రెడిట్ క్యాంపుకు వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులంతా ధ్రువీకరణ పత్రాలు తీసుకుని క్రెడిట్ క్యాంపుకు హాజరవ్వాలని సూచించారు.

మినీ లారీ బోల్తా



కర్లపాలెం: మండల పరిధిలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి టైర్ పంక్చర్ కావడంతో ఓ మినీ లారీ బోల్తా కొట్టింది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు.. పచ్చిమిర్చి బస్తాల లోడుతో వెళుతున్న మినీ లారీ టైరు పంక్చర్‌తో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పచ్చి మిర్చి బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్‌ను ఆస్పత్రికి పంపి, రోడ్డుపై పడిన బస్తాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన

తెనాలి రూరల్: ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్టు పేరున ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్న ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్లను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పరిశీలించారు. అనుచరులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అధునాతన సాంకేతిక పనిముట్లు, హార్టీకల్చర్ వర్క్‌షాప్‌లు ఔషధ మొక్కలు ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

కర్లపాలెంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు

కర్లపాలెం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఇఫ్తార్ విందు ఇచ్చారు. కర్లపాలెం దండుబాట మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన విందును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, నాయకులు జయప్రకాష్ నారాయణ, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పిట్ల వసంతరెడ్డి, ఎస్‌కే బాజీ, అహ్మద్ బాషా పాల్గొన్నారు.



విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

సూచనల మేరకే ఎరువులు వినియోగించాలి

ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి

అత్తోట(కొల్లిపర): రైతులు పంటలు సాగు చేసే ముందు భూమి నుండి కొంత మట్టి సేకరించి పరీక్షలు నిర్వహించి, ఫలితాలు అనంతరం వ్యవసాయాధికారుల సూచనలు ప్రకారం ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అత్తోట గ్రామంలో శనివారం ఆర్‌ఏఈపీ విద్యార్థులతో నేల ఆరోగ్యం పరిరక్షణలో భూసార పరీక్షల అవశ్యకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ నేల ఆరోగ్యం, తాగునీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని చెప్పారు. రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనలు ప్రకారం పంటలు, ఎరువులు వాడాలన్నారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట రాములు, ప్రధానోపాధ్యాయురాలు వై.భారతి, ఉపాధ్యాయులు దేవదాను, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి

క్రీడలతో మానసిక ఉల్లాసం

డీఎస్పీ జనార్దనరావు

తెనాలి టౌన్: క్రీడలు మనిషి శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీఎస్పీ బి.జనార్దనరావు పేర్కొన్నారు. స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ బి.జనార్దనరావు హాజరయ్యారు. ఫిబ్రవరి నెలలో శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలైన రాయల్ ఛాలెంజ్‌కు టీంకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ట్రోఫీ, రన్నర్ టీంకు రూ.5000, ట్రోఫీ డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఏర్పాటు చేసి యువతను క్రీడల్లో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించడం అభినందనీయమని డీఎస్పీ కొనియాడారు. అనంతరం స్వర్ణకార సంఘ సభ్యులకు ఐడెంటిటీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నాసర్ అహ్మద్, కోశాధికారి మునగాల శ్రీనివాస్, జిల్లా ప్రెసిడెంట్ తాడేపల్లి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్, 19వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, వెండి అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఫజిల్ ఖాన్, కార్యదర్శి పఠాన్ జిలానీ ఖాన్ పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

అధికారులు.. పనితీరు మార్చుకోండి !

- ఫంగస్ చేరిన నీరు సరఫరా చేస్తారా?
- నీటి పరీక్షలు చేసే వ్యక్తి గుంటూరులో ఉంటాడా?
- మే 15 లోపు లోపాలు సరిచేసుకోండి!
- ఇంజనీరింగ్ సిబ్బందికి మంత్రి మనోహర్ సూచన

తెనాలి అర్బన్: "రూ.95 కోట్లతో తెనాలి తీసుకు వచ్చిన రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్తంగా తయారైంది. నిర్వహణలో లోపాలు ఉండటం వలన అక్కడక్కడా ఫంగస్ చేరింది. ఆ నీటినే ప్రజలకు అందించడం దుర్మార్గం" అంటూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఎస్సార్ కళాశాల రోడ్డులోని రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆవరణలో అక్కడక్కడా టైల్స్ పడిపోవడం, ఫంగస్ చేరి ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. నీటి పరీక్షలు రోజుకు మూడుసార్లు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పరీక్షలు చేసే వ్యక్తి గుంటూరులో నివాసం కలిగి ఉండటాన్ని తప్పుబట్టారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం ఇన్‌ఛార్జి ఎంఈ, ఇతర అధికారులు కూడా వారానికి ఒకసారి పరిశీలించడం లేదనే విషయం నిర్ధారణ అయినట్లు చెప్పారు. మే 15లోపు నీటి సరఫరా కేంద్రాల్లోని లోపాలని సరిచేయాలని ఆదేశించారు.



సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్

చలివేంద్రం ప్రారంభం

వేమూరు: వేసవిలో ప్రజలకు తాగునీరు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సుశీల తెలిపారు. తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేసిన రాయల్ ఇండస్ట్రీస్, గంగోత్రి ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దారు నరేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు సుశీల

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వేమూరు: తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దండే సుబ్బారావు, పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, కనగాల మధుసూదనరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు